

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న ' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

"**ఇవాళ లంచ్**కి బయటికి వెళ్దాం" హనీష అంది.

నా దగ్గర అంత డబ్బు లేకపోయినా ఉద్యోగం వచ్చిందన్న ధైర్యంతో సరే అన్నాను. మధ్యాహ్నం అవుతుండగా హనీష లంగా వోణి వేసుకుంది.

"ఎక్కడికి?" అడిగాను.

"చెప్పానుగా. లంచ్‌కి"

"ఇలా వెళ్ళొచ్చా?"

"ఇలానే వెళ్ళాలి."

అర్థంకాక అలానే చూసాను.

"ఓ నీకు చెప్పలేదా? సారీ. మనం గృహప్రవేశానికి వెళ్తున్నాము" అంది.

"గృహప్రవేశమా? ఎవరిది?" ఆశ్చర్యపోయాను.

"మన సందులో కార్నర్ ఇల్లు"

"జాబ్ చేస్తున్నారా?"

"లేదు, స్టూడెంటే."

"స్టూడెంట్ ఇల్లు కొన్నారా?" కళ్ళు పెద్దవి చేసి అడిగాను.

"లేదు" పగలబడి నవ్వింది.

అర్ధంకాక నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"అద్దె ఇల్లు మారింది. దానికి గృహప్రవేశం" నవ్వు ఆగాక చెప్పింది.

"ఒక్కళ్ళే ఉంటారా?"

"లేదు. ముగ్గురుంటారు"

ఇంకేమనాలో తోచక నిశ్శబ్దంగా ఉండిపోయాను.

"పద వెళ్దాం" అంది.

"వాళ్ళెవరో కూడా నాకు తెలీదు. నేను వస్తే బావుండదు" అన్నాను.

"ఏం కాదు. వాళ్ళేమనుకోరు. అక్కడ అందరూ ఉంటారు. నీకు పరిచయమౌతారు."

"అయినా కూడా వాళ్ళెవరో ఇంటికి డైరెక్ట్ పరిచయం లేకుండా లంచ్‌కి వస్తే బావుండదు. నేను ఇంట్లోనే ఉంటా. నువ్వు వెళ్ళిరా" అన్నాను.

"ఏం కాదు. వాళ్ళేమనుకోరు" అంది.

నేను కదలకపోయేసరికి "ఆకలేస్తుందా?" అడిగింది.

"లేదు" బదులిచ్చాను.

"అయితే నాతోపాటు వచ్చి ఇంట్లో తినేసానని చెప్పు. అందరినీ కలవొచ్చు, మొహమాట పడక్కర్లేదు"

"ఈ ఐడియా బానే ఉంది. సరైతే" ఇద్దరం బయలుదేరాము.

పక్కనే ఉన్న వాళ్ళ ఇంటినిండా జనాలు. హనీష ఒక ఇద్దరు ముగ్గురికి పరిచయం చేసి తినడానికి కిచెన్‌లోకి వెళ్ళింది. అక్కడ ఒక్కరూ తెలియక పోవడంతో ఇబ్బందిగా అనిపించి బయలుదేరదామనుకుంటున్న సమయానికి ఎవరో వెనకనుండి భుజం తట్టారు. తిరిగి చూస్తే అది అభిషేక్.

"హే. నువ్వు వచ్చావేంటి? వీళ్ళు ముందే తెలుసా?"

వెంటనే చిన్నబోయి "హనీషతో వచ్చాను" అన్నాను.

"ఓ..ఔనా. ఎలా ఉంది అంతా?"

"బానే ఉంది. నువ్వెలా ఉన్నావు?"

"నేను నార్మల్. లాబ్‌కి ఎప్పటినుంచి వస్తావు?"

"తెలీదు. ప్రొఫెసర్ ఇంకా చెప్పలేదు" ఆయన ఇచ్చిన టెక్స్ట్ బుక్స్ కథంతా చెప్పాను.

"నాకూ అలానే ఇచ్చారు. అందులోంచి ఏమీ అడగరు. నీకు అర్థమైందా లేదా, డౌట్స్ ఉన్నాయా అని చెక్ చేస్తారంతే."

"పక్కానా? ఆ బుక్స్ ఈజీగా అర్థమవ్వాలంటే ఏం చెయ్యాలి?"

"యా..యా. డోంట్ వర్రీ. అవి నీ థీసిస్‌కి కావాలంటే అప్పుడు చూడొచ్చులే. ప్రస్తుతానికి టెన్షన్ పడకు. లైట్ తీసుకో" అన్నాడు.

ఇంతలో ఎవరో అభిషేక్‌ని పక్కకి పిలిచారు .ఆ సంభాషణతో గుండెలో దిగులు మొదలైంది ఇంటికి వెళ్ళి చదువుకుందామని బయలుదేరబోతుండగా "మాకు హాయ్ కూడా చెప్పరా?" గొంతు వినబడింది.

పక్కకి తిరిగి చూస్తే రామ్.

"ఓ, హాయ్. సారీ చూడలేదు" చిన్నగా నవ్వాను.

"అంతా ఓకేనా?" అడిగాడు.

"యా. అంతా ఓకే" బదులిచ్చాను.

"తనతో మాట్లాడగానే అలా వెళ్ళిపోతుంటే ఏమైనా గొడవయ్యిందేమో అని అనుమానం వచ్చింది. ఏం అనుకోకు."

"యా. పర్లేదు. గొడవ ఏం కాలేదు " ఆ టెక్స్ట్ బుక్స్ కథంతా చెప్పాను.

"అదా సంగతి మరేం చేస్తావు?"

"ఇంటికి వెళ్ళి చదువుతాను"

"నిన్న ఏం అర్థంకాలేదన్నావు?"

"ఔను. అందుకే దిగులుగా ఉంది."

"మరి ఇవాళ చదివితే వచ్చేస్తుందా?"

కోపంగా చూసాను.

"మీ ప్రొఫెసర్‌కి చెప్పు. ఈ బుక్స్ అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయి. ఇవి అర్థ చేసుకోవడానికి ముందు ఏ చదవాలో అడుగు" కాస్త నవ్వాడు.

"అలా అడిగితే జాబ్ తీసేస్తారేమో?"

"లేదు. ఒక్కసారి పేపర్ వర్క్ పూర్తయితే వర్రీ అక్కర్లేదు. ఆయనకి మంచి ఇంప్రెషన్ వస్తుంది. ఇక్కడ నిజం చెప్పేవారంటే చాలా ఇష్టపడతారు. మన ఇండియాలో లా కాదు. ప్లస్ నీకు హెల్ప్ అవుతుంది కూడా. క్లాసెస్‌కి కూడా ఈజీ అవుతుంది" వివరించాడు.

"సరే. ఈ మెయిల్ చెయ్యనా?"

"ఇటివ్వు నీ ఫోన్ అన్‌లాక్ చేసి."

ఇచ్చాను తన నంబర్ సేవ్ చేస్తాడనుకుంటే ప్రొఫెసర్‌కి ఈ మెయిల్ రాసి ఇచ్చాడు. "చదివి పంపించు" అన్నాడు.

నాకన్నా వెయ్యి రెట్లు బాగా రాసాడు.

థాంక్స్ చెప్పి ప్రొఫెసర్‌కి పంపాను.

"ఈ మెయిల్స్ అలవాటయేంత వరకు ఎవరి సహాయమయినా తీసుకో" అన్నాడు.

"సరే". ఈ మెయిలు పంపిన వెంటనే ఒక్కసారిగా దిగులు పోయింది. ఇంతలో హనీష వచ్చి అందరికీ పరిచయం చేసింది.

"పూజకి రాకుండా ఇప్పుడొచ్చింది, తెలుసా?" గృహప్రవేశం చేసిన అమ్మాయి నాతో అంది.

"వీళ్ళు ఆరున్నరకే పూజ చేసారు" హనీష నన్ను చూసి చెప్పింది.

"మరి పాలు పొంగించడానికి అప్పుడే మంచి ముహూర్తం" బదులిచ్చింది.

ఫక్కున నవ్వాను. వెంటనే "ఈమె అవని. మా టెంపరెరీ రూమ్మేట్. తనే ఈ ఇంట్లో ఉండేది, శ్రీలేఖ" పరిచయం చేసింది హనీష.

"ఎక్కడికి మారుతున్నావు?" నన్ను శ్రీలేక అడిగింది.

"అంటే?" అర్థంకాక అన్నాను.

"టెంపరరీ అంది కదా, పర్మనెంట్ చూసుకున్నావా?"

"ఇంకా లేదు."

"తను వెతుకుతుంది" హనీష అంది.

"ఇప్పటివరకు దొరకలేదంటే ఇంక కష్టమే" శ్రీలేఖ అంది.

"భయపెడతావెందుకు? సుప్రియకి దొరికినట్టే దొరుకుతుంది."

"సుప్రియకి దొరకడమే ఒక మిరాకిల్."

"మరీ అంతగా ఏదీ దొరక్కపోతే మాతోనే పర్మనెంట్‌గా ఉంటుంది."

"మీకు చాలా కష్టమౌతుంది. వెన్నెల పొద్దున్నే ఆఫీసుకి వెళ్ళాలి, మీ ఇద్దరికి క్లాసులుంటాయి. బాత్‌రూం ఒక్కటేగా, సరిపోదు"

"మేం అడ్జస్ట్ చేసుకుంటాం. చాలామంది అలానే మేనేజ్ చేస్తారుగా."

"ఏమో మరి. మీ మంచికోసమే చెప్తున్నా."

"సరే. థాంక్స్."

"మొహం మీదే చెప్పానని ఏమనుకోకు. నేను ముక్కు సూటి మనిషిని" నాతో అంది శ్రీలేఖ.

"నో ప్రోబ్లం" అన్నాను.

"నీ కాళ్ళకి పసుపు రాయాలి. ఇప్పుడే వస్తా" పిలిచినా వినిపించుకోకుండా వెళ్ళింది.

"హనీషా నాకు ఇవేవీ వద్దు. స్టూడెంట్స్ గృహప్రవేశం అంటేనే ఎలానో ఉంది. కాళ్ళకి పసుపంటే చిరాకుగా ఉంది" నెమ్మదిగా చెప్పాను.

"నాకూ ఇవేవీ నచ్చవు. నేను చెప్తాలే" అంది.

ఇంతలో శ్రీలేఖ వచ్చింది. "మా ఇద్దరికీ ఇవేవీ వద్దు" హనీష గట్టిగా చెప్పింది.

"లంగా వోణి వేసుకుంటే చాలదు హనీ, కాళ్ళకి పసుపు కూడా రాసుకోవాలి" ఎగతాళిగా అంది శ్రీలేఖ.

"పెళ్ళయ్యాక రాసుకుంటాలే. ఎన్ని క్లాసెస్ తీసుకుంటున్నావు ఈ సెమిస్టర్‌లో" టాపిక్ మార్చింది హనీష.

ఆశ్చర్యంగా, చదువు గురించి మాట్లాడేటప్పుడు మామూలుగానే ఉంది శ్రీలేఖ. పసుపులు, గోరింటాకులలా కాక నా వయసు అమ్మాయిలా అనిపించింది.

తిరిగి ఇంటికి నడుస్తూ వెళుతుండగా " ఆ అమ్మాయితో జాగ్రత్త. ఆవులిస్తే పేగులు లెక్కపెట్టే రకం. తనకి ఆల్రెడీ పెళ్ళి ఫిక్స్ అయిపోయింది. చాలా చాలా ఆర్తడాక్స్" అంది.

"అర్థమైంది. నీకు క్లోజ్ అనుకుని నేనేమనలేదు"

"నాకు లంగా వోణీ వేసుకోవాలనిపించి వచ్చాను. లేకపోతే అసలు వెళ్ళేదాన్నే కాదు. కేంపసులో ఫోటోలు తీసుకుందామా?" అడిగింది.

"యా.. తీసుకుందాం" వెంటనే ఇద్దరం వెనక్కి తిరిగి కేంపస్ వైపుగా నడిచాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story